క్లుప్తంగా

ఆరిపాక హైస్కూల్లో సైన్స్ ఎగ్జిబిషన్



హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎంఈవో-2 రవీంద్రబాబు, తదితరులు

సబ్బవరం: మండలంలోని ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పాఠశాల స్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి-2 రవీంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొని, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మొక్కల పెంపకం ఆవశ్యకత, వాటి పరిజ్ఞానాన్ని విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీను, ఉపాధ్యాయులు భాస్కర్, సునీత తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరంలో పేర్లు నమోదు చేసుకుంటున్న ప్రజలు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం ఆధ్వర్యంలో ముత్యాలమ్మపాలెం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం గ్రామాలకు చెందిన 350 మంది పాల్గొని, వైద్య సేవలు పొందారు. వైద్య శిబిరంలో రక్త పరీక్షలు, చర్మ వ్యాధులు, సాధారణ వైద్య పరీక్షలు జరిపి, ఉచితంగా మందులు అందించారు. శిబిరంలో సర్పంచ్ చింతకాయల సుజాతముత్యాలు, ఎంపీటీసీ దేవి రవి, సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం సీనియర్ మేనేజర్ కె.ప్రకాశరావు, సీనియర్ ఎగ్జిక్యూటివ్ శివ ప్రతాప్‌సింగ్, పాఠశాల హెచ్ఎం లక్ష్మి పాల్గొన్నారు.

చీమలాపల్లిలో రెవెన్యూ సదస్సు నేడు

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లి వార్డు సచివాలయంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఆనంద్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సు ద్వారా చీమలాపల్లి రెవెన్యూ పరిధిలో భూములున్న రైతులు రెవెన్యూ పరమైన, ఇతరత్రా సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావొచ్చని సూచించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలతో పాటు, రీసర్వేలో జరిగిన పొరపాట్లపై సదస్సులో అర్జీలు దాఖలు చేసి, వాటిని త్వరితగతిన పరిష్కరించుకోవచ్చన్నారు.

అవయవదానంపై అవగాహన పెరగాలి



అవయవదానంపై అవగాహన కల్పిస్తున్న సంఘ చైర్‌పర్సన్ సీతామహాలక్ష్మి

పెదగంట్యాడ: అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెరగాలని, మరో వ్యక్తికి పునర్జన్మ ఇవ్వడానికి అవయవదానమే మార్గమని పీఏఎన్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత, అఖిల భారత అవయవ దాతల సంఘం కన్వీనర్ పాల నవీన్‌రెడ్డి అన్నారు. పెదగంట్యాడ కూడలిలో శుక్రవారం అవయవ దానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా అఖిల భారత అవయవ దాతల సంఘం చైర్‌పర్సన్ డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవయవ దానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, రక్తదానం కూడా చేయాలని పిలుపునిచ్చారు. అవయవ దానంతో ఎందరో జీవితాల్లో వెలుగు నింపవచ్చన్నారు. కార్యక్రమంలో 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయ్, వినోద్‌బాలు, పల్లా కార్తీక్, పులి రమణారెడ్డి, కిలాన ముసలయ్య, వరలక్ష్మి, గ్రేస్ కళాశాల విద్యార్థులు, వేమన ఐటీఐ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పెందుర్తి తహసీల్దార్ కార్యాలయం నుంచి విద్యుత్ శాఖ ఏఈ కార్యాలయానికి ర్యాలీగా తరలివెళుతున్న అదీప్‌రాజ్, నియోజకవర్గ నాయకులు



ఈపీడీసీఎల్ జేఈఈ లక్ష్మికి వినతిపత్రం అందిస్తున్న అదీప్‌రాజ్, పార్టీ నేతలు

నయవంచన.. కూటమి పాలన



- ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచబోమని అబద్ధాలు
- ఏడు నెలల వ్యవధిలో ప్రజలపై రూ.15 వేల కోట్ల భారం
- ప్రజల తరపున ప్రశ్నించే గొంతుల్ని నొక్కుతున్న కూటమి ప్రభుత్వం
- అయినా వైఎస్సార్‌సీపీ భయపడదు... ప్రజల గొంతుకై పోరాడుతుంది
- విద్యుత్ చార్జీల పెంపుపై పోరుబాటలో మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: 'ఎన్నికల ప్రచార సమయంలో మేం అధికారంలోకి వస్తే ఐదేళ్ల పాటు ఒక్క రూపాయి కూడా విద్యుత్ చార్జీలు పెంచబోమని సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కల్యాణ్ హామీలు గుప్పించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లు అమర్చడానికి వచ్చిన వారిని తరిమి తరిమి కొట్టాలని ప్రస్తుత మంత్రి నారా లోకేష్ నోటికొచ్చినట్లు మాట్లాడారు. కానీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ మాయా కూటమి ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కింది. ప్రజలకు తెలియకుండానే విద్యుత్ చార్జీలు పెంచుతూ రెండు దఫాలుగా రూ.15 వేల కోట్ల భారాన్ని మోపింది. స్మార్ట్ మీటర్లు అమర్చడానికి వస్తున్న వారిని ఇప్పుడు ఏం చేయాలో మంత్రి లోకేష్ చెప్పాలి'అంటూ వైఎస్సార్‌సీపీ పెందుర్తి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ప్రశ్నించారు. ప్రజల్ని వంచించి, కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన ఏడు నెలల వ్యవధిలో విద్యుత్ చార్జీల బాదుడుకు నిరసనగా శుక్రవారం వైఎస్సార్‌సీపీ పోరుబాటకు భారీ ఎత్తున ప్రజల నుంచి మద్దతు లభించింది.

మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో రాంపురం నుంచి జాతీయ రహదారి మీదుగా పెందుర్తి కూడలి, అక్కడి నుంచి బీఆర్‌టీఎస్ రహదారి మీదుగా పెందుర్తి మండల పరిషత్ కార్యాలయం వరకు భారీ ఎత్తున బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం మీదుగా కాలినడకన ఏపీఈపీడీసీఎల్ సబ్ స్టేషన్ వరకు పాదయాత్ర నిర్వహించారు. పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ అక్కడ ఆందోళన చేపట్టారు. అనంతరం జేఈఈ లక్ష్మికి పెంచిన విద్యుత్ చార్జీలు తక్షణమే ఉపసంహరించుకోవాలని, ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీ మేరకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందించాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రాలు సమర్పించారు.

ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు తామంతా కూటమి హామీలను నమ్మవద్దని ప్రజలకు ఎంతగానో చెప్పామన్నారు. అయితే చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ట్రాప్‌లో పడిన ప్రజలు వారిని నమ్మి ఓట్లేస్తే ఏడు నెలలు తిరగక ముందే నిలువునా మోసం చేశారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చుతామని చెప్పి, ఇప్పుడు చూద్దాం.. చేద్దాం అంటూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల గురించి ప్రశ్నిస్తున్న సోషల్ మీడియా కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేసి భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులకు గురి చేసినా వైఎస్సార్‌సీపీ వెనకడుగు వేయబోదని స్పష్టం చేశారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రజా పోరాటాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయిలపూడి భగవాన్ జయరామ్, సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, పార్టీ ముఖ్య నేతలు ఉప్పిలి కనకరాజు, కొటాన రాము, మధుపాడ అంజి, బోకం రామునాయుడు, గండి రవికుమార్, సబ్బవరపు ముత్యాలనాయుడు, కాపుశెట్టి శేషుబాబు, వనం అచ్చింనాయుడు, పాలిశెట్టి సురేష్‌రాజ్, గొరపల్లి శ్రీను, రాపర్తి మాధవరావు, దాడి ఉమామహేష్, మెంటి మహేష్, గండ్రెడ్డి మహాలక్ష్మినాయుడు, అప్పికొండ మహాలక్ష్మినాయుడు, దాడి నూకరాజు, చొప్పా నాగరాజు, నదియా, కొలుసు ఈశ్వరరావు, ఉగ్గిన గోవింద, బొడ్డు సూర్యప్రకాష్, కొయిలాడ శ్రీను, గొంప అప్పారావు, కోన శ్రీనివాసరావు, వడ్డాది అప్పలరాజు, మోపాడ అప్పారావు, బోని గంగునాయుడు, బలిరెడ్డి కనకరాజు, ఎస్.అప్పారావు, గొన్న హేమచంద్ర, బట్టు పైడిరెడ్డి, ఎంపీ రెడ్డి, కర్రి వినోద్‌కుమార్, పీతల అప్పలరాజు, నాగభూషణంనాయుడు, కోన రామారావు, సబ్బవరం, పెందుర్తి, పరవాడ, జీవీఎంసీ పరిధి నియోజకవర్గ పట్టణ ప్రాంతాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న అదీప్‌రాజ్

నిరుపేదల పాలిట శాపం



ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీల పెంపు ఐదేళ్ల పాటు ఉండబోదని చంద్రబాబు హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వం ఇష్టానుసారం విద్యుత్ చార్జీలు పెంచేసింది. ఇలా అయితే నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు బతికేదెలా. ఈ నిర్ణయం మాపాలిట శాపం.

– కర్రి వినోద్, దేశపాత్రునిపాలెం, పరవాడ

ఉపసంహరించుకోవాలి



ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచేది లేదని చెప్పి, ఇప్పుడు దాదాపు రూ.15 వేల కోట్ల భారం రాష్ట్ర ప్రజలపై మోపడం దారుణం. తక్షణమే పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలి. లేకపోతే రానున్న రోజుల్లో ప్రజల తిరుగుబాటును మరింత భారీగా ఎదుర్కొనక తప్పదు.

– రాపర్తి మాధవరావు, పొర్లుపాలెం

దారుణ మోసం



ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఎన్నో హామీలు గుప్పించారు. విద్యుత్ చార్జీలు పెంచబోమన్నారు. సూపర్ సిక్స్ హామీలు పక్కాగా అమలు చేస్తామని చెప్పారు. కానీ అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే ప్రజలను దారుణంగా మోసం చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలు తక్షణమే తగ్గించాలి.

– బట్టు సతీష్‌రెడ్డి, 77వ వార్డు

నేటి నుంచి సీపీఎం జిల్లా మహాసభలు



మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు, స్థానికులు

- రెండు రోజుల పాటు సుజాతనగర్‌లో నిర్వహణ
- హాజరుకానున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

పెందుర్తి: సీపీఎం విశాఖ జిల్లా మహాసభలను సుజాతనగర్‌లో శని, ఆదివారాల్లో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ గోపాలపట్నం జోన్ కార్యదర్శి బి.జగన్ తెలిపారు. పెందుర్తి ప్రాంతంలో శుక్రవారం పలు చోట్ల మహాసభల పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ శనివారం ఉదయం పెందుర్తి జూనియర్ కళాశాల నుంచి సభాస్థలి వరకు మహా ప్రదర్శన ఉంటుందన్నారు. అనంతరం 11 గంటలకు సుజాతనగర్‌లో బహిరంగ సభ జరుగుతుందన్నారు. సభకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.లోకనాథం, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు, మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ ముఖ్య వక్తలుగా పాల్గొంటారని పేర్కొన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ మహా సభల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రజావ్యతిరేక పాలన గురించి, ప్రజల తరపున చేయనున్న పోరాటాల గురించి లోతుగా చర్చలు జరుగుతాయన్నారు. మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బి.రమణి, బి.వెంకట్రావు, జోన్ ప్రతినిధులు జక్కాన సత్యనారాయణ, కె.అప్పలనాయుడు, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి పడి వ్యక్తి మృతి



ప్రమాదం జరిగిన అపార్ట్‌మెంట్ ఇదే(ఇన్‌సెట్‌లో నాగరాజు(ఫైల్))

పరవాడ: దేశపాత్రునిపాలెం గ్రామంలో ఓ అపార్ట్‌మెంట్‌పై నిర్మాణ పనులు చేస్తున్న భవన నిర్మాణ కార్మికుడు నాలుగో అంతస్తు నుంచి జారి పడి మృతి చెందాడు. మృతుడు శ్రీకాకుళం జిల్లా వీరఘట్టాం మండలం కడకెల్ల గ్రామానికి చెందిన సీహెచ్ నాగరాజు అని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. దేశపాత్రునిపాలెం గ్రామ సమీపంలో పి.బోనంగికి వెళ్లే రహదారి వద్ద గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నాలుగు అంతస్తుల అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్నాడు. శుక్రవారం ఉదయం నాగరాజు నాలుగో అంతస్తులో నిర్మాణ పనులు చేస్తుండగా ఉన్నట్టుండి కాలుజారి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో నాగరాజు తలకు బలమైన గాయమై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతదేహానికి కేజీహెచ్‌లో శనివారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు సీఐ తెలిపారు.

రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యల పరిష్కారం



కలపాకలో అధికారులకు అర్జీలు ఇస్తున్న రైతులు



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ తదితరులు

పరవాడ: భూములకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకు వచ్చి పరిష్కరించుకోవాలని పరవాడ డిప్యూటీ తహసీల్దార్ సురేష్ నాయుడు కోరారు. కలపాక గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడారు. చిన్నపాటి సమస్యలున్నా రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చిన భూసమస్యలను 45 రోజుల్లో పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కలపాకలో సర్వే నెం.92/2లో గల తన భూమిని రీసర్వేలో తన అన్నయ్య మహ్మద్ రంజాన్ ఆలీ పేరున నమోదు చేశారని గ్రామానికి చెందిన సౌకత్ ఆలీ అనే రైతు అధికారుల వద్ద మొరపెట్టుకున్నాడు. మళ్లీ రీ సర్వే నిర్వహించి తనకు న్యాయం చేయాలని అర్జీ సమర్పించాడు. రెవెన్యూ సదస్సులో ప్రజలు పలు భూ సమస్యలపై 36 అర్జీలు దాఖలు చేశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాసరావు, వీఆర్వో నారాయణమ్మ, నాయకులు ఇందల కొండలరావు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. మండలంలోని గొల్లలపాలెం, విప్పాక అగ్రహారం రెవెన్యూ పరిధిలో శుక్రవారం నిర్వహించిన సదస్సుల్లో ఆయన పాల్గొని, రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. గొల్లలపాలెం రెవెన్యూ గ్రామంలో మొత్తం 3,683 ఎకరాల భూమి ఉండగా, అందులో 2,066.68 ఎకరాల ప్రభుత్వ భూమి, 1616.32 ఎకరాల జిరాయితీ భూమి ఉందన్నారు. అదే విధంగా విప్పాక అగ్రహారం పరిధిలో 89.39 ఎకరాల మొత్తం భూమి ఉండగా దీనిలో 15.98 ఎకరాల ప్రభుత్వ భూమి, 73.41 ఎకరాల జిరాయితీ ఉందన్నారు. సదస్సులో తహసీల్దార్‌తో పాటు మండల సర్వేయర్ లాలం అప్పారావు, ఆర్ఐ వీరయ్య, వీఆర్వోలు దేముడుబాబు, శేఖర్, వెలుగు సర్వేయర్ రాంబాబు, విలేజ్ సర్వేయర్ దినేష్ ,గ్రామ పెద్దలు బోండా రాజు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు విశేష అభిషేకాలు





వేంకటేశ్వరస్వామికి అభిషేకాలు చేస్తున్న అర్చకుడు, పాల్గొన్న అశేష భక్త జనం

పెందుర్తి: స్థానిక వేంకటాద్రిపై జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా 12వ రోజు శుక్రవారం వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో తొలి వేకువజాము ఉంచే పూజలు ప్రారంభమయ్యాయి. హారతి, సేవాకాలం, శాత్తుమురై, తిరుప్పావై పారాయణం, ప్రవచనం, తీర్థగోష్టి జరిపారు. వివిధ రకాల ప్రసాదాలు నివేదించారు. 12వ పాశురం వినిపించారు. అనంతరం ఈవో నీలిమ పర్యవేక్షణలో భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు.

95, 97 వార్డుల బీజేపీ అధ్యక్షుడిగా చిక్కాల



నియామక పత్రం అందుకుంటున్న సతీష్

పెందుర్తి: జీవీఎంసీ 95, 97వ వార్డుల అధ్యక్షుడిగా చినముషిడివాడకు చెందిన చిక్కాల సతీష్ నియమితులయ్యారు. ఈ మేరకు సుజాతనగర్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన ఎన్నికలో సతీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం పార్టీ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టాభి ప్రసాద్, పెందుర్తి పార్టీ కన్వీనర్ గొర్లె రామునాయుడు చేతుల మీదుగా నియామకపత్రం అందించారు. కార్పొరేటర్ ముమ్మన దేముడు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సింహగిరిపై గోదాదేవికి ప్రత్యేక పూజలు





గోదాదేవి సన్నిధిలో తిరుప్పావై పారాయణం చేస్తున్న సింహాచల దేవస్థాన వైదికులు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గోదాదేవికి విశేషంగా తిరువీధి నిర్వహించారు. ఉదయం అమ్మవారి సన్నిధిలో పాశుర విన్నపం, అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకిలో అధిష్టింపజేసి ఆలయ బేడా మండపంలో తిరువీధి నిర్వహించారు. విశేష హారతులందించారు. స్థానాచార్యులు టి.పి. రాజగోపాల్, వేద పండితులు పాల్గొన్నారు.

నేడు సబ్బవరం మండల సర్వసభ్య సమావేశం

సబ్బవరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పద్మజ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బోకం సూర్యకుమారి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. మండల ప్రగతి, అభివృద్ధి పనులపై చర్చిస్తారన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి మండలంలోని ప్రాదేశిక సభ్యులతో పాటు గ్రామ సర్పంచ్‌లు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు విధిగా హాజరుకావాలన్నారు.

ప్రజా పోరాటాలు మరింత ఉధృతం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మరింత ఉధృతంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నామని సీపీఎం జిల్లా నాయకుడు కె.ఎం.శ్రీనివాస్ తెలిపారు. 86వ వార్డు కూర్మన్నపాలెం రాజీవ్‌నగర్ కూడలిలోని పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం సీపీఎం 24వ మహాసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షిస్తామని ఏమార్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్కో అడుగు ప్రైవేటీకరణ వైపు వేస్తున్నారన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షల మందికి ఉపాధి కల్పించే స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించాలని వేడుకుంటే.. కనికరించని ప్రభుత్వం అదే కర్నాటకలో ఒక చిన్న స్టీల్‌ప్లాంట్‌కు రూ.15 వేల కోట్లు సహాయంగా అందివ్వడం చూస్తుంటే కేవలం విశాఖ స్టీల్‌ప్లాంట్ భూములను కొట్టేయడానికి ఇలా దిగజారిపోతున్నారని ఆరోపించారు. పాలకులు చెబుతున్నది ఒకటి, ఇక్కడి యాజమాన్యం చేస్తున్నది మరొకటిగా కనిపిస్తోందని చెప్పారు. కార్మికులకు ఐదు మాసాలుగా అత్తెసరు జీతాలు చెల్లిస్తూ వేధిస్తుండటం అన్యాయమన్నారు. ఈ నెల 28న నిర్వహించనున్న బహిరంగ సభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మార్కెట్‌లో కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు ఎం.కృష్ణారావు, కె.గంగాధర్, దత్తాత్రేయ రాజు, జి.సూరిబాబు, గోపాలకృష్ణరాజు, కృష్ణార్జున, అప్పారావు, ఎం.వి.రమణారావు, శివరాంలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బాక్సింగ్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న సురేంద్రమోహన్, పీలా శ్రీనివాస్, ముమ్మన దేముడు

పెందుర్తి: జాతీయ బాక్సింగ్ దినోత్సవం సందర్భంగా కృష్ణరాయపురంలో ఏర్పాటు చేసిన బాక్సింగ్ పోటీలు ఉత్సాహభరితంగా జరిగాయి. ఆర్టీబీసీ బాక్సింగ్ క్లబ్ కోచ్ ఎ.సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన పోటీలను బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్రమోహన్, కార్పొరేటర్లు పీలా శ్రీనివాసరావు, ముమ్మన దేముడు ప్రారంభించారు. క్రీడాకారులు పోటా పోటీగా తలపడ్డారు. విజేతలకు మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందించారు. స్థానిక నాయకులు అవగడ్డ అప్పలనాయుడు, కంచిపాటి మధు, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.